
కథ

# మదరమ్మ



-డాక్టర్ యశస్వి

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే "సుబ్బయ్య గారి అనాధ శరణాలయం" ఆరోజు కొంచెం కలవరపడుతోంది. దానిక్కారణం - అనాధ శరణాలయానికి "అమ్మ"లాంటి "మదరమ్మ" కు సుస్తీ చేయడమే!

ఏ అమ్మ పేరు చెప్తే శరీరం పులకిస్తుందో, ఏ అమ్మ పేరు చెప్తే ప్రేమ అవధులు దాటుతుందో ఆ అమ్మకి ఆరోగ్యం బాగాలేదని తెల్సి, ఆ శరణాలయం లోని నూట యాభై మంది పిల్లలు రాత్రి నుంచి పచ్చి మంచి నీళ్ళు కూడా ముట్టలేదు.

శరణాలయం మొదలు పెట్టినపుడు "మదర్"గా పరిచయమైన సుందరమ్మ ఇపుడు వృద్ధాప్యపు నీడలో "మదరమ్మ" అయింది. సుబ్బయ్య గారిఆస్తిని,భవంతినీ ఒక కొలిక్కి తెచ్చి కొద్ది రోజుల్లోనే ఉత్తమ శరణాలయంగా మార్చడాన్కి అహర్నిశలు కృషి చేసింది సుందరమ్మ.

ఆ కృషి, నిస్వార్ధ సేవ ఫలితమే నేడు మదరమ్మ పొందుతున్న ప్రేమ. తను కనలేదు! తను పాలిచ్చి పెంచలేదు. మరి ఎక్కడి నుంచి వచ్చిందీ ప్రేమ ఈ పిల్లలకు! తను కని పెంచిన పిల్లలకు తన మీద ప్రేమ ఎందుకు లేనట్లు? మదరమ్మ ఆలోచనలు గతంలోకి జారుకున్నాయి.

సుందరమ్మకు ముచ్చటగా ఒక కొడుకు, ఒక కూతురు వున్నారు. కూతురు అల్లుడి ఉద్యోగ రీత్యా ఢిల్లీలో ఉంటుంది. కూతురు పెళ్ళి చేసిన కొన్ని రోజులకు సుందరమ్మ భర్త చనిపోయారు. కొడుకు లాయరు చదువు అవ్వగానే, డిగ్రీ పాసైన అమ్మాయిని కోడలిగా తెచ్చుకొన్నది సుందరమ్మ. తను తెచ్చుకొన్నది కోడలిని కాదు "కష్టాల్ని" అని తర్వాత సుందరమ్మకు తెల్సింది. కోడలు, కొడుకు లేనప్పుడు ఏదో ఒకటి తిడుతూనే వుండేది. కొడుక్కి చెప్పినా పెళ్ళాన్ని వెనకేసుకొచ్చి తననే తిట్టేవాడు.

తను ఇంట్లోంచి బయటికొచ్చిన రోజు తల్చుకొని కళ్ళ నీళ్ళు తుడుచుకొంది మదరమ్మ.

ఆ రోజు కొడుకొచ్చి "అమ్మా! కోడలు పిల్ల సబ్బు పెట్టి స్నానం చెయ్యడానికి సిగ్గు లేదా?నువ్వు యూస్ చేసిన సోప్ అది వాడితే, దాని ఫేస్ కూడా నీ ఫేస్ లాగానే ముడతలు పడి పోవాలనేగా అలా చేసావు?" ఇంకా చెప్పిపోయి ఏవేవో అనేశాడు. కోడలు కూడా విపరీతంగా పేలింది.

ఆరాత్రే తను, తన తండ్రి పాత స్నేహితుడని సుబ్బయ్యగారింటికెళ్ళడం, సుబ్బయ్య చనిపోయిన తర్వాత, అతని వీలునామా చూచి, తను "అనాధ శరణాలయం" నడపడానికి ముందుకు రావడం అంతా దేవుడు చూపించిన త్రోవగా నమ్మింది సుందరమ్మ.

"మదరమ్మ"కు ఆయాసం ఎక్కువవుతుంది. ఒక్కసారి భవంతి అంతా కలియచూసింది. ఎటు చూచినా తన పిల్లలే! మదరమ్మ శిక్షణలో పిల్లలు స్వశక్తి పైన ఆధారపడటం నేర్చుకొంటారు. భావితరానికి పటిష్టమైన పునాదులు వేసింది మదరమ్మ. అప్పుడప్పుడూ శరణాలయంలో చదువుకొని బాగా వృద్ధిలోకి వచ్చిన విద్యార్థులు మదరమ్మ దగ్గరకు వచ్చి, ప్రేమతో కష్ట సుఖాలు తెల్సుకొని, అనాధలకు చేతనైన సహాయము చేసి వెళ్తూ వుంటారు.

మదరమ్మకు కళ్ళు మూతలు పడిపోతున్నాయి. తనకు తెల్సిపోతోంది యమభటులు పిలుస్తున్నట్లు. ఎలా ఈ అనాధ శరణాలయాన్ని వదలి వెళ్ళేటట్లు? ఇంత మందిని అనాధల్ని చేసి వెళ్ళిపోవడమేనా? ఇవే ఆలోచనలు మదరమ్మ మెదడు నిండా.

అంతలో మదరమ్మ చుట్టూ వున్న పిల్లలు తప్పుకొనగా "అరుణ" ఆదుర్దాగా వచ్చి "అమ్మా! నీకు బాగా లేకపోతే నాకు కబురు చెయ్యొచ్చుగా" అంటూ భోరున ఏడ్చింది. అప్పటి దాకా ఉన్న పరిస్థితి అదుపు తప్పింది. అందరూ ఏడవటం మొదలు పెట్టారు.

"అరుణ" అనాధ శరణాలయం పాత విద్యార్థిని. ఇపుడు మెడిసిన్ చదువుతోంది. నాల్రోజులు శలవులొస్తే మదరమ్మని చూచి పోదామని వచ్చింది. మదరమ్మ చివరి ఘడియలలో ఉందని తెల్సుకుంది అరుణ.

మదరమ్మకి అరుణని చూడగానే సుమారు 20 ఏళ్ళ (ఇరవయ్యేళ్ళ) క్రితం జరిగిన గతం గుర్తుకొచ్చింది. అరుణ పుట్టిన కొన్ని గంటల లోనే అరుణ అమ్మమ్మ అరుణని అనాధ శరణాలయానికి ఇచ్చేసింది.

ఆరోజు మదరమ్మకు బాగా గుర్తు. మిట్టమధ్యాహ్నం ఒక ముసలి ఆవిడ వచ్చి "ఈ ముదరష్టపు పిల్ల మా అమ్మాయికి పుట్టింది. మా అమ్మాయికి ఇప్పటికే ఒక పాప, బాబు ఉన్నారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు సరిగా పాటించక పోవడం వలన ఈ ఆడ శని పుట్టింది. ఏదో మొగ పిల్లాడు పుడతాడు అని ఆశపడితే మైనస్ పుట్టింది." ఇం కొంచెం గొంతు తగ్గించి "ఎవరితో చెప్పకండి ఈ పాప లాయరు విశ్వనాధం గారి అమ్మాయి" అని రహస్యంగా చెప్పి వేగంగా వెళ్ళిపోయింది.

మదరమ్మ కాళ్ళ క్రిందభూమికంపించినట్లయ్యింది. లాయరు విశ్వనాథ్ తన కన్న కొడుకు. చివరికి పిల్లల్ని అనాధ శరణాలయానికి అంటగట్టే స్థితికి దిగజారేడు. దేవుడు మనవరాల్ని పెంచుకొమ్మని పంపినప్పుడు ఏ నానమ్మ కాదనగల్గుతుంది? అరుణని తన మనవరాలని ఎవరికి చెప్పకుండా అపురూపంగా పెంచింది. ఆఖరుకి అరుణకు కూడా ఆ విషయము చెప్పలేదు.

అందరూ చూస్తూ ఉండగానే మదరమ్మ తల ప్రక్కకు వాలిపోయింది. అందరూ పెద్దపెట్టున ఏడ్వ నారంభించారు. ఆ ప్రాంతమంతా ఒక్క నిముషములో ఏడుపులతో ప్రతిధ్వనించింది.

మదరమ్మ అందరినీ వదిలేసి "అనాధ"గా వెళ్ళిపోయింది. మదరమ్మ లేని అనాధ శరణాలయం "అనాధ" అయిపోయింది. మదరమ్మ అంత్యక్రియలు శరణాలయం పెద్దలు అతి శ్రద్ధతో జరిపించారు. మదరమ్మ కొంగుకి కట్టి ఉన్న తాళం చెవితో, ఆమె ట్రంకు పెట్టెని తెరచిన అరుణకు ఒక డైరీ కనబడింది.

డైరీ చదివిన అరుణకు తన పుట్టుకకు కారకులెవరో అర్ధమయిపోయింది. ఎందుకు మదరమ్మ తన జన్మ రహస్యాన్ని "రహస్యంగా" ఉంచిందో అర్ధమయ్యింది. కుటుంబ నియంత్రణ పద్ధతులు "ఫెయిల్" అవ్వటం వలన పుట్టిన పిల్లని వదిలివేసిన తల్లిదండ్రుల దగ్గరకు రేపొకవేళ వెళ్ళినా నువ్వు మా పిల్లవు కాదు అని పొమ్మన వచ్చు. లేక, తమ పిల్లేనని నమ్మినా, పొరపాటున వాళ్ళ "మూడ్" బాగా లేనప్పుడు తుమ్మినా, దగ్గినా మళ్ళీ ఇంట్లోంచి తరిమివేయవచ్చు.

ఎంత లోతుగా ఆలోచించి ఈనిర్ణయం తీసుకొందో మాతృమూర్తి - మదరమ్మ. అరుణ కళ్ళు చెమర్చాయి. కాస్సేపటికి కన్నీళ్ళు కట్టలు తెంచుకొని ప్రవహించాయి. కన్నతల్లి బతికి వున్నా చూడ మనస్కరించలేదు. పెంచిన తల్లి పరలోకానికి చేరినను, చూడాలనే తాపత్రయము ఎంత చిత్రం - ప్రేమ బంధం. అప్పటికప్పుడే ఒక కఠోర నిర్ణయానికొచ్చింది అరుణ.

పెళ్ళి - మొగుడు - పిల్లలు - మనస్పర్ధలు - నో!

కొన్ని సంవత్సరాల తర్వాత...

డాక్టరు అరుణ బ్రహ్మచారిణిగా ఉండిపోయింది. అనారోగ్యంతో బాధ పడుతున్నా పేదలకు వైద్య సహాయం చేస్తోంది. అనాధ శరణాలయాన్ని ఆధునికంగా మార్చి తన జీవితాన్ని అనాధలకు, పేదలకు అంకితం చేసింది - అరుణమ్మ - మరో మదరమ్మ. ★

---

**జూక్ హోల్**

**మీరిలా రోజూ తాగి వస్తే రేపటి నుంచి వూరుకునేది లేదు హెచ్చరించింది పార్వతి భర్తని.**

**అంతే మర్నాడు నుంచి ఏకంగా ఇంటికే తెచ్చుకునే తాగడం మొదలెట్టాడా భర్త ఆమె ఆజ్ఞను శిరసావహించి.**

**— వెన్నెపగడ, విజయవాడ.**